# తలవని తలంపు

— శ్రీమతి జి. కళ్యాణి —

★

'అదిగో, రాముడూ! ఆ ముసలమ్మ. దాన్నిచూస్తే నా కడుపు చెరువైపోతుంది.'

రోడ్డు కెడమవైపుగా, మెల్లిగా రిక్షాలాగుతూ 'అవునమ్మా. ఏంచేస్తుంది? పాపం, అలాగే మెల్లిగా ఇంటింటికీ తిరుగుతూవుంటుంది. ముగ్గిపోయిన పండుగదా. పట్టుమని పదికొంపలేనా తిరగలేదు. ఆ తిరిగిన కొంపల్లో దొరికిన గింజలతోటే దానిబ్రతుకు తెల్లారాలి.' అన్నాడు రాముడు తుండుగుడ్డతో చమట తుడుచుకుంటూ. రిక్షా రోడ్డుప్రక్కల చెట్లనీడల్లో మెల్లిగా దొర్లుతూంది. శ్యామల అందులోకూర్చొని ఆ ముసిలిదానికేసే చూస్తూవుంది.

'పాపం, ఆ రోజున నాన్నగారు అడ్డురాకపోతే బుట్టనిండా బియ్యంపోసేదాన్ని. నాన్నగారి మనస్సు కఠినపాషాణం. అదెంత తిట్టుకుంటూపోయిందో! అలాంటివాళ్ల ఉసురుతగిల్తే ఇంకేమయినా ఉందా?'

'అంతా నీలాంటివాళ్లే ఉంటారమ్మా. మీ నాన్నగార్ని ఎంతమంది తిట్టిపోస్తూవుంటారు? రక్తం పిండుకుతాగుతాడనీ, పిసినిగొట్టనీని. అవన్నీ వింటూంటే నాకు చాలా కష్టంగావుంటుంది.'

స్కూలుగంట గణగణ మ్రోగింది. అదివిని రాముడు ఉలికిపడి గబగబా లాగటం మొదలెట్టేడు.

'మెల్లిగాలాగు రాముడూ! దగ్గిరకొచ్చేశాంగా' అంది శ్యామల.

♦ ♦ ♦

స్కూలుగంట శబ్దం విని రాముడు రిక్షాలోంచి లేచి దిండు సరిచేసేసరికి శ్యామలవచ్చి కూర్చుంది. యెంతో దిగులుగాఉన్న శ్యామలనిచూచి

'ఏమమ్మా ఆలాగున్నావు మేష్టరేమన్నా అన్నారా?' అన్నాడు రాముడు.

స్కూలుకేసి దీనంగా చూస్తూఉన్న శ్యామల కనుకొలుకుల్లోంచి నీటిబిందువులు జలజలా రాలేయి.

'ఈ బడికీ మనకీ ఋణం తీరిపోయింది రాముడు—'

'అదేమమ్మా?'

'సెలవులిచ్చేశారు; రేపణ్ణుంచే ప్రారంభం'

'మళ్లీ తెరుస్తారుగా ఈ వేసంగి వెళ్లగానే?'

'ఆ, తెరుస్తారు. అందరూ వస్తారు తిరిగి, కాని నాకు ప్రాప్తంలేదు'

'అదేమిటమ్మా?'

'ఈ వేసంగి సెలవల్లో నా వివాహం—ఇక స్కూలుకు రానివ్వరుగా'

శ్యామల నోటివెంట ఆ మాటలు రావడంతోటే రాముడు బిక్కపోయాడు. శ్యామలకేసి అర్థహీనంగా చూట్టం మొదలెట్టేడు. రేపటినుంచి ఆ రిక్షాకీ తనకీ ఋణం తీరిపోయిందనుకున్నాడు. అప్పటికి 14 సంవత్సరాలునుంచి ఆ రిక్షా తన శరీరంలో ఓకీలులా తిరుగుతూంది. శ్యామల్ని యెత్తుకొని ఆడించేడు చిన్నతనంనుంచీని. ఆమెను పెంచిన తన హృదయంలో శ్యామలమీద సోదరీవాత్సల్యం చక్కగా పెరిగి,

పుష్పించింది. ఆ సౌరభం ఆనాటితో మరిరాదు. చీకూ చింతా లేకుండా ఇన్నాళ్లు పెరిగిన తన జీవితలత వేరొకవృక్షాన్ని ఆధారంచేసుకొని పాకిపోవాలి. ఇంకో చెట్టో పుట్టో దొరుకుతుందో దొరకదో... అతనికంతా శూన్యంగా కనిపించింది.

◆ ◆ ◆

మంగళతూర్యనాదాలతోటి, విప్రవరుల వేదఘోషలతోటి, పేరంటాండ్ర మంగళగీతికలతోటి శ్యామల వివాహం దేదీప్యమానంగా జరిగింది. సాయంత్రం పెళ్లి పెద్దలందరూ ఫోటో తీయించుకున్నారు. రాముడు శ్యాము బలవంతంమీద ఓమూల నుంచున్నాడు. తరువాత శ్యామల్ని తీసుకొని వెళ్లిపోతున్నారత్తవారు. వారితో రాముడుకూడా వెళదామనుకొని ఉబలాటపడ్డాడు గాని పనుంది ఆగిపొమ్మని శ్యామల తండ్రి అంటే ఆగిపోయేడు. పల్లకీలో మంచి సుఫర్ద్రూపియైన బి. ఎ. పెళ్లికొడుకు యెదురుగుండా శ్యామల తలవంచుకొని కూర్చుండగా బోయీలెత్తేరు పల్లకి. అరుగునంటిపెట్టుకొని నుంచుండిపోయాడు రాముడు పల్లకీ వెళ్లిపోతూవుంటే దానికేసి తదేకధ్యాన్నంగా చూస్తూ.

◆ ◆ ◆

పాతికేళ్లు గిర్రుమని తిరిగిపోయేసరికి, కాలంలోనే గాదు, మనుష్యులలోకూడ వూహాకందని మార్పు కలిగిపోతుంది. నాటి పిన్నలు ఇప్పుడు పిన్నలకు పెద్దలై సంసారాలు దిద్దుకొంటూవుంటే ఆ మార్పును గుర్తించలేము.

పట్నంలో రంగంనుంచి వచ్చిన రామస్వామినాయుడుగారి మిల్లు అంటే పేదవాళ్లకి పెన్నిధిలా వుంది. 5 ఏళ్లు తిరిగేసరికి రామస్వామినాయుడుగారి ఖ్యాతి నలుదిశలా వ్యాపించింది. నిరుద్యోగ పట్టభద్రుల దగ్గరనుంచి, నిరక్షరాస్యులైన నీరసపు సంసారులందరికి అతడు దాత అయిపోయాడు. అందరికి అతనంటే పితృవాత్సల్యం.

నాటి రిక్షాలాక్కని పొట్టపోసుకున్న రాముడే నేడు మిల్లు యజమాని రామస్వామినాయుడు అంటే ఎవరైనా నమ్ముతారా!

◆ ◆ ◆

నాడు నాయుడుగారి యింటికి వచ్చేవారు, పోయేవారుతోను చాలా హంగామాగాను, హడావిడిగాను వుంది. నాయుడుగారికి టైఫాయిడ్ జ్వరము చాల తీవ్రముగావుందని పట్నం అంతా విచారిస్తోంది. పనివాళ్లు ఎప్పుడు యేమాట వింటామో అని దిగులుగా భగవంతుణ్ణి ప్రార్థిస్తూ నాయుడుగారి యింటిముందు కూర్చున్నారు.

నాయుడుగారి గదిలోంచి అందరూ యీవలికి వచ్చేశారు నాయుడుగారి కోరికమీద. మిల్లు మేనేజరు గోపాలరావుపంతులు ఒక్కడుమాత్రము నాయుడుగారి మంచంప్రక్కన కూర్చునియున్నాడు. గోపాలరావుపంతులుమీద నాయుడుగారికి అమితమైన వాత్సల్యం. ఆయన నడవడి, కష్టానికి ఓర్చి పదిమందికి మంచిచేయాలనే స్వార్థరహితమైన నడత ఆయన్ని ముగ్ధుణ్ణిచేశాయి. కళ్లుతుడుచుకుంటూ

'ఏమి శలవు?' అన్నాడు పంతులు.

'నాయనా, నాకు యిక శలవైంది. మిల్లునంతా అందులో పనిచేసే పనివాళ్లందరికీ యిచ్చేశాను. ఆసంఘానికి నీవుపెద్దవు. దాన్ని నీవు నేనులేని లోటులేకుండా నిరవాకంచెయ్యి. నీచేతుల్లో పెట్టుతూన్నాను. ఇంక ఒక్కటే కోర్కె వుంది. బేంకులోవున్న 50 వేల రూపాయిల్లోను సగం, చూడు, యీ ఫోటోలోవున్న

అమ్మాయికి యిచ్చివెయ్యాలి. మిగిలినది మిల్లుది. ఆమెకోరకు ప్రయత్నించాను రంగూన్నుంచి వచ్చినప్పటి నుంచీను. కాని ఆమెను చూచే భాగ్యానికి నేను నోచుకోలేదు. యీమె ఫలానా గణపతిరావు వకీలుగారి కూతురు...' అంటూ ఫోటో చేతికిచ్చాడు.

గోపాలరావుపంతులు ఫోటో అందుకుని చూచి నిర్వెరపడిపోయాడు—

గబగబ యీవలకువచ్చి కారుయెక్కి యింటికి వెళ్లిపోయాడు. తిరిగి వెంటనే వచ్చేశాడు భార్యతో నాయుడుగారి దగ్గరకు.

నాయుడుగారు శ్యామలను చూచి 'అమ్మా, అమ్మా నిన్ను తిరిగి చూస్తాననుకోలేదు తల్లీ... రంగూన్నుంచి వచ్చి నీ చిన్ని చేతుల్లో ఒక చీర పెడదామనుకొన్నాను. అదిగో ఆ పెట్టెలో వుంది తీసుకో. నీ వాత్సల్యం, అభిమానంతో పెరిగిన దేహమే యిది. ఇదిగో యీ హృదయంలో యింకాఉంది ఆనాటి నీ యనురాగం. గోపాలరావుగారు స్ఫోటకపు మచ్చలతో రూపుమారిపోయారు. తెలుసుకోలేకపోయాను. భగవంతుడు కలుపుతాడు. అతడు దయాసాగరుడు—'అంటూ శ్యామల రెండుచేతులూ పట్టుకున్నాడు.

వణుకుతోవున్న చేతులుమీద జలజలా రాలాయి శ్యామల కళ్లల్లోంచి అశ్రువులు.

నాయుడుగారి గుండెమీదవున్న తన పెళ్లినాటి ఫోటోకేసి శ్యామలచూచి యేదో చెప్పబోయింది. యింతలో నాయుడుగారి చేతులు నీటికుండలైపోయాయి. తలవనితలంపుగా జరిగిన యీ సంఘటనకు తెల్లబోతూ శ్యామల మరి మాట్లాడలేకపోయింది. ఆలాగే నిర్వెరబోయి నిలబడిపోయింది.

## చిత్ర వస్త్ర కారుఁడు

నేయుమా బట్ట సోదరా! నేయుమయ్య
బిర బిరను విసరు కండె సంబరము తోడ
చూపుమా నీదు నేర్పుతో జూపుమోయి
ప్రకృతి యందున్న వింత సంభారములను,
పౌరు, జిగి, రంగు మృదులతా సౌష్టవంబు
ముదురు, లేతల కలయిక మోహనంబు
గాగ సృష్టించు నేర్పు నీకడనె కలదు
సౌరభం బొక్కటే గూర్ప జాల వీవు
నేయుమా సోదరా నేయుమా నీవు—
సంజ కెంజాయల సవరింపు మయ్య
ప్రతి తంతువున దయ పరిథ విల్లంగ
ప్రతి దారమున కళల్ ప్రజ్వరిల్లంగ
ప్రతి సూత్రమున శాంతి ప్రబలు చుండంగ
సృష్టింపుమా చిత్ర చిత్రంబులైన
నిరుపేద పాలి పెన్నిధియైన శుద్ధ
దేశీయ వస్త్రకళా విశేషముల
ఎన్ని జన్మాల నెత్తిననేని జనుఁడు
ప్రోదిగా జేయ డొక్కక పోగుతోడ
పడుగు పేకను గూర్చియు పంచనేసి
ఐకమత్యము నందున్న యతిశయంబు
చాటుచున్నావు ప్రజకు నిశ్శంక తోడ
చీర యందున తంతువుల్ జేరినట్లె
సర్వభూతంబు లందున సర్వసాక్షి
నిండి యున్న దటంచను నిజముమాకు
చూపుచుంటివే సోదరా! చూపుమయ్య—

—విద్వాన్ శ్రీ వెం. శే. శర్మ.